# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనలో భాగంగా ఈరోజు పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.**

2. **ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

3. **వ్యర్థ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.**

5. **పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ సూచించారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు తెలంగాణలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి పలు మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. హైదరాబాద్-పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా జాతీయ రహదారి-167ను నాలుగు లేన్లుగా విస్తరించే పనులకు; సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో 2 వేల 350 కోట్ల రూపాయలతో పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే హైదరాబాద్‌లోని మల్కాపూర్ టెర్మినల్‌ను కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారని అధికారులు తెలిపారు. ప్రధానమంత్రి పర్యటన దృష్ట్యా హైదరాబాద్ లో నిన్న సాయంత్రం నుండి ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నాయి

--------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం విజయవాడలో ప్రారంభించిన సంచార వాహనాన్ని మంత్రి నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆహార స్వయం సమృద్ధిలో ప్రకృతి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రోత్సాహం

లభించడమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని మంత్రి తెలుపుతూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాలకు చెందిన సుమారు వంద మంది ఉద్యోగులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ సందర్భంగా సహకార శాఖ ప్రతినిధులు వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును విజయవాడలో నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడంతో పాటు, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వారి ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను వ్యర్థ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు గ్రామీణ మండలం దొంతాలి గ్రామంలోని చెత్త డంపింగ్ యార్డు, శుద్ధి కర్మాగారం పనులను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. దొంతాలిలో రెండేళ్లలో వ్యర్థాల నుండి శక్తిని ఉత్పత్తి చేసే ప్లాంట్ నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మరో ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ

వాయిస్..30.. సెకన్లు

---------------------------

భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ఈరోజు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతాధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రహదారులు, భవనాలు శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి తెలిపారు. వైయస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని కొర్రపాడు రహదారి విస్తరణ పనులకు స్థానిక శాసనసభ్యులు వరదరాజుల రెడ్డితో కలిసి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తొమ్మిది నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌ను గుంతల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని ఆయన తెలియజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలంలోని ఆగరవెలువలి, ఆగర్తపాలెం, పూలపల్లి, సగం చెరువు, గోరింటాడ గ్రామాల్లో 8 కోట్ల 34 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిన్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా గోరింటాడలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. పాలకొల్లు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో ఏర్పాటు చేసిన 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్'ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం ద్వారా పాత వస్తువులు, పుస్తకాలు, గృహోపకరణాలు వంటివి సేకరించి అవసరమైన వారికి అందించనున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్-2047' ప్రణాళికను రూపొందించామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి అంశాలపై హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌ను ట్రాఫిక్ సిగ్నల్స్ రహితంగా మార్చేందుకు అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఉపరితల రహదారులతో మూడంచెల వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పార్కింగ్ సమస్యల పరిష్కారానికి మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, దక్షిణ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. నిన్న కర్నూలు జిల్లా తోవిలో 41.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైందని తెలిపింది.

తెలంగాణలోనూ ఈరోజు, రేపు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో ఉన్న కనిగిరి జలాశయం ఆధునీకరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 48 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. బుచ్చిరెడ్డిపాలెంలోని కనిగిరి జలాశయం తూర్పు కాలువ నుంచి పంటల కోసం సాగునీటిని ఆమె నిన్న విడుదల చేశారు. అనంతరం ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, జలాశయం ఆధునీకరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. తద్వారా సాగునీటి సౌకర్యాలు మెరుగుపడి, స్థానిక రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

=====================